## క్లుప్తంగా

### కురిసిన వర్షం.. ఖరీదవుతున్న విత్తనాలు



పెద్దేముల్‌లో కురుస్తున్న వర్షం

పెద్దేముల్: మండల కేంద్రంలో సోమవారం ఉదయం గంట పాటు ఏకదాటిగా వర్షం కురిసింది. విత్తనాలు నాటి వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆనందం వ్యక్తం చేశారు. కొంత మంది విత్తనాలు నాటడం మొదలు పెట్టగా, మరి కొంత మంది మళ్లీ వర్షానికి నాటడం జరుగుతుందని మండలంలోని పలు గ్రామాల రైతులు అంటున్నారు. విత్తనాలు దుకాణాలు రైతులతో కళకళలాడుతున్నాయి. నేటి వరకు వర్షాలు లేక విత్తనాలు కూడా రైతులు ఖరీదు చేయలేదని, వర్షాలు కురవడంతో విత్తనాలకు గిరాకీ పెరిగిందని వ్యాపారస్తులు అంటున్నారు. గతంలో కంటే ఈ ఏడాది పత్తి విత్తనాలు అధికంగా ఖరీదు అవుతున్నాయని ఎరువుల దుకాణాల యజమానులు అంటున్నారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: మండలంలోని సాల్వీడు గ్రామానికి చెందిన బోడ వెంకటయ్య సోమవారం అకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, స్థానిక గ్రామ నాయకులు అంత్యక్రియలకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేదల కు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న ఆనంద్, మహేష్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజు వికారాబాద్ పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమాల్ రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, కిరణ్‌పటేల్, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, రాంరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

### గెలుపు సంబరాలు



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు సంబర్భంగా ఆదివారం మండల పరిధిలోని రేగడిమైలారంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ జెండా కట్టి జెండాను ఎగురవేశారు. టపాసులు పేల్చి నాయకులు, కార్యకర్తలు జైతెలంగాణ నినాదాలు చేసుకున్నారు. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల గట్టినమ్మకంతో ఉన్నారని అన్నారు. ఇందులో ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్యామలయ్యగౌడ్, నాయకులు గోవింద్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, ఎంపీటీసీ జగదీశ్, వెంకట్రాములు, శ్రీనివాస్ తదితరులున్నారు.

### అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం తైద అంబలి పంపిణీ చేశారు. వేసవిలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో ప్రతి సోమవారం అంబలి, మజ్జిగను ప్రజలకు పంపిణీ చేస్తూ వస్తున్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలో వారాంతపు సంత కావడంతో ప్రజలకు అంబలి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నాగయ్య, శ్రీనివాస్, చందు, రాజు, సుదర్శన్, సోను ఉన్నారు.

# వానాకాలం సాగుకు సన్నద్ధం

- నకాలంలో అందని బ్యాంకు రుణాలు
- ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



దౌల్తాబాద్‌లో పొలం దున్నుతున్న రైతు

దౌల్తాబాద్: రైతులు వానాకాలం సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. తొలి వర్షానికే ఎద్దులు, ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నుతూ విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. యాసంగి కష్టాలను నెమరు వేసుకుంటూనే వానాకాలం పంటలకు సన్నద్ధమవుతున్నారు. అన్నదాతలకు సకాలంలో బ్యాంకులు రుణాలు ఇవ్వక పోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారిచ్చిన అప్పులతో వ్యవసాయం పనులను మొదలు పెట్టారు.

**ప్రకృతి కన్నెర్ర..**

గత యాసంగి రైతులకు నష్టాలను మిగిల్చింది. దిగుబడులు రాక పెట్టుబడులు కూడా మిగల్లేదు. అయినా, రైతులు భూమిని నమ్ముకుని సాగు చేస్తున్నారు. నష్టం వచ్చిందని వ్యవసాయం చేయడం పక్కన పెట్టడం ఇష్టం లేక వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఎరువుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మండలంలో గతేడాది కంటే ఈ సారి 1200 హెక్టార్లలో వరకు సాగు విస్తీర్ణం పెరగనున్నాయి. సాగు చేయడానికి పెట్టుబడులు అవసరం రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతుల ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దిగుబడి రాక పెట్టిన పెట్టుబడులు చేతికందక రైతులు లబోదిబోమంటున్నారు. కొత్తగా అప్పులు తెచ్చి సాగు పనులు చేస్తున్నారు. ఈ సారైనా లాభాలు బాగా రావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డుపైనే వారాంతపు సంత

- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు
- స్థలం కేటాయించాలని వినతి

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, బాలంపేట, కుదురుమళ్ల గ్రామాల్లో వారాంతపు సంత నిర్వహణకు స్థలం లేక చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తుండడంతో వ్యాపారులు వినియోగదారులు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నా రు. మండల కేంద్రంలోని దౌల్తాబాద్ సంత కు యాంకి, గుముడాల, అల్లాపూర్, కొడీడ్, నర్సాపూర్ గ్రామాలకు, చెందిన వ్యాపారులు. బాలంపేట సంతకు అంతారం, సుల్తాన్‌పూర్, నాగసార్,గత్ప, కుదురుమళ్ల సంతకు ఇందాపూర్, నాచారం, సంగాయిపల్లి గ్రామాలకు చెందిన రైతులు వారు పండించిన కూరగాయాలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ కూరగాయాలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు భారీగా వస్తుంటారు. సంత నిర్వహణకు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో ప్రధాన రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. సంత రోజు గ్రామంలోకి వెళ్లే రోడ్డు రైతులు వ్యాపారులు, స్థానికులతో కిటకిటలాడుతోంది. దీంతో ద్విచక్రవాహనాలు సైతం ఆ రోడ్లపై వెళ్లలేని పరిస్థితి. విక్రయదారులు, వినియోగదారులు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని బాల ంపేట, దౌల్తాబాద్ వారాంతపు సంత నిర్వహించేందుకు స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తే సంత మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.



బాలంపేటలో రోడ్డుపైనే సంత

# అమరుల త్యాగాలతోనే తెలంగాణ

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: అమరుల త్యాగాలతోనే తెలంగాణ సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం పట్టణ కేంద్రంలోని బాల సదనంలోని చిన్నారులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ కోసమే ఆనాడు గులాబీ జెండా పుట్టిందని, కేసీఆర్ సారథ్యంలో, అమరుల త్యాగాలతో తెలంగాణ సిద్ధించిందన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉండి ప్రజలకు ఎన్నో సంక్షేమాలు అమలు చేసి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమరులను మరిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, నగేశ్వర్, రవికుమార్, రవీందర్ పాల్గొన్నారు.

### కొండా గెలవాలని ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లి గ్రామంలో సోమవారం స్థానిక శివాలయంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందాలని కోరుతూ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ బస్వలింగం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణచారి, పాండురంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

పరిగి: దళితులపై దాడులు చేసిన అగ్రకులస్తులను వెంటనే అరెస్టు చేయాలని పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని రుక్కుంపల్లికి చెందిన హరిజన మొగులయ్యపై ఏప్రిల్ 28న గ్రామంలో పోచమ్మ బోనాల దగ్గర అగ్రకులస్తులు దాడికి దిగారు. దీంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనా అరెస్ట్ చేయడం లేదన్నారు. దళితులని చిన్న చూపు చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఇష్టానుసారంగా కొట్టడంతో పాటు భూతులు తిట్టిన వారిని పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే వారిని అరెస్ట్ చేయాలని లేదంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు మొగులయ్య, వెంకయ్య, చంద్రయ్య, గోవర్ధన్, లక్ష్మీ, మల్లమ్మ, కనుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలతో ప్రయోజనం

ప్రిన్సిపాల్ మంజుల



క్యాన్వర్సింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

దోమ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మంజుల పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మోత్కుర్‌లో కళాశాల సిబ్బందితో కలసి క్యాన్వర్సింగ్ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి జూనియర్ కళాశాల స్టడీపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు మెరుగైన విద్యాను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిందన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయని, ఆసక్తి గల వారు జాయినింగ్ కావాలని కోరారు. కళాశాలలో విశాలమైన గ్రౌండ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, క్రమశిక్షణతో కలిగిన ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు తమ సిబ్బంది అనునిత్యం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధ, శ్రీవిద్య, రాములు, లక్ష్మయ్య, శ్రీధర్, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా



ఎల్‌ఓసీ చెక్కులను అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్ : అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజలకు సీఎం సహాయనిధి భరోసాకు కల్పిస్తుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారులకు ఎల్‌ఓసీలను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలకు కార్పొరేట్ స్థాయి లో వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని బుల్కాపూర్ గ్రామానికి చెందని ఆనిశమ్మ కుటుంబ సభ్యులకు రూ.2,80,000ల ఎల్‌ఓసీ, కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామానికి చెందిన భీంరెడ్డి కుటుంబ సభ్యులకు రూ. 1,30,000ల ఎల్‌ఓసీ, కోస్గి పట్టణం కు చెందిన అబ్దుల్లా కుటుంబ సభ్యులకు రూ.1,15,000ల ఎల్‌ఓసీలను అందజేశారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పనులకు డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం రూ.2 లక్షల 51 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5,11,113లు విరాళం అందజేస్తానని గతంలో సత్తయ్య హామీ ఇచ్చారు. మొదట్లో కొంత నగదు అందజేయగా, సోమవారం మిగతా మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తాకు అందజేశారు. రూ.2 కోట్లకుపైగా నిధులతో గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు.

# అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి



పరిగి: వర్షాలు కురుస్తున్నాయి.. రైతులు విత్తనాల కొనుగోలుకు మొగ్గు చూతున్నారని వారి అవసరాలను ఆసరాగా చేసుకుని విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాయలంలో కిసాన్ సంఘం పరిగి మండల సమావేశం నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బసప్ప, దామోదర్‌రెడ్డిలతో పాటు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘ్ సభ్యులు రైతుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. పరిగి మార్కెట్ యార్డులో రైతులు ధాన్యం విక్రయించేందుకు వస్తే రైతులను మోసం చేస్తూ బుక్కచిట్టీలు ఇస్తున్నారన్నారు. పరిగిలో జరుగుతున్న దోపిడీని మార్కెట్ కమిటీ అరికట్టాలని కోరారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. నిత్యం సంఘం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో రక్షక్ వాహనాలు!

- తరచూ పాడవుతున్న వైనం
- కాలం చెల్లిన వాహనాలతో పోలీసుల అవస్థలు




మెకానిక్ షెడ్డుకు చేరిన రక్షక్ వాహనం




పంక్చర్ అయిన వాహనం

తాండూరు: ప్రజలకు ఏ సమయంలో ఆపద వచ్చిన 100కు డయల్ చేస్తే మెరుపు వేగంతో వచ్చి ప్రజలను రక్షించడంతో పాటు శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసుశాఖ ముందుంటుంది. అయితే, అలాంటి పోలీసుశాఖకు సంబంధించిన రక్షక్ వాహనాల పాడై పోలీసులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని రక్షక్ వాహనాలు పాతబడ్డాయి. సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 5 స్టేషన్‌లు ఉన్నాయి. తాండూరు పట్టణ స్టేషన్‌లో సీఐ, ఇద్దరు ఎస్సైలు, సుమారు 50 మంది వరకు కానిస్టేబుళ్లు ఉన్నారు. రూరల్ సర్కిల్ పరిధిలో కరన్‌కోట్, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల ఉంది. ఒక్కో ఠాణాకు రక్షక్ వాహనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించింది. ఈ వాహనాలు 24 గంటలు గస్తీలో భాగంగా తిరుగుతూ ఉంటాయి. వాహనాలకు ఏదైనా సమస్య వచ్చిన మెకానిక్‌ల వద్దకు వెళ్లే వీలు తక్కువగా ఉంటుంది. దీంతో పోలీసులకు భద్రతపరంగా ప్రమాదం ఉంది. గతేడాది అర్ధరాత్రి గస్తీలో భాగంగా వెళ్తున్న పోలీసుల వాహనం టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో పోలీసులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇటీవల కాలంలో పోలీసు అధికారులు వినియోగిస్తున్న రక్షక్ వాహనాలు చెడిపోయి తరచూ మెకానిక్ షెడ్డులకు చేరుతున్నాయి. వాహనాలకు సరైన టైర్లు లేకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చిన సమయంలో ఎస్కార్ట్‌గా ముందు వెళ్లేందుకు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. వాహనాలకు సమయానికి సర్వీసింగ్ చేయించకపోవడంతోనే ఫిట్‌నెస్‌కు ముందే మరమ్మతుల కు గురవుతున్నాయని స్థానికంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసు స్టేషన్లకు కొత్త రక్షక్ వాహనాలు అందించాలని పోలీసులు కోరుతున్నారు.

# బాలవికాస్ విద్యార్థులకు బహుమతులు

రాష్ట్ర బాల వికాస్‌సమన్వయ కర్త హరినాథ్‌రెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ధారూరు: బాలవికాస్ విద్యార్థులు పలు కళలపై మంచి ప్రతిభ కనబర్చరని రాష్ట్ర బాల వికాస్ సమన్వయ కర్త హరినాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేరెళ్లి గ్రామ సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రంలో బాలవికాస్ విద్యార్థులకు 31 రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 1నుంచి 31 వరకు 31 రోజుల పాటు ఆర్ట్, క్రాఫ్ట్, కరాటే, డ్రాయింగ్, పేయింటింగ్, డాన్స్ తదితర కళలపై విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇప్పించామని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్, పెయింటింగ్‌ను ఆహుతులు ఆశక్తిగా తిలకించారు. అలాగే, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌సింగ్ ఠాగూర్, కేరెళ్లి కేంద్రం అధ్యక్షుడు రఘునందన్, కార్యదర్శి ఎం.ప్రేంకుమార్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ శ్రీకాంత్, డాన్స్ టీచర్‌లు సరస్వతీ, సరోజ పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్టు

ఎస్‌ఐ అరవింద్



సమావేశంలో మాట్లాడుతూన్న ఎస్‌ఐ అరవింద్

మోమిన్‌పేట: నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్‌ఐ అరవింద్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. నకిలీ విత్తనాలు ఎవరైన అమ్మితే సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎరువులు, విత్తనాలు ప్రతిరోజు ఎంత అమ్ముతున్నారో ఎవరికి అమ్ముతున్నారో రిజిస్టర్‌లో రాసి ఉంచాలని సూచించారు. రైతుల ఫోన్ నంబర్లను కూడా నమోదు చేయాలని తెలిపారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ జయశంకర్ తదితరులు ఉన్నారు.

# పత్తి విత్తనాల కొరత లేదు

ఏడీఏ రుద్రమూర్తి



ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేస్తున్న రుద్రమూర్తి

తాండూరు రూరల్: తాండూరు ప్రాంతంలో పత్తి విత్తనాల కొరత లేదని వ్యవసాయశాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని రాజ్‌సెల్స్, రవిరాజ్, నందిని, కావేరి, హన్‌మాన్, మనగ్రోమూర్, న్యూసందిప్, అన్నదాత ఫెర్టిలైజర్స్,ఫెస్టిసైడ్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ..విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలని సూచించారు. తాండూరు డివిజన్‌లో 44 వేల ఎకరాల్లో పత్తిసాగు చేస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించి 1లక్ష 12 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మొద్దని హెచ్చరించారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

# ప్రశాంతంగా పది సప్లమెంటరీ పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: జిల్లాలో సోమవారం పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 25 సెంటర్లలో మొత్తం 1395 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1209మంది విద్యార్థులు హాజరయ్యారు.186మంది గైర్హాజరయ్యారని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. కాగా, విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే సెంటర్ల వద్దకు చేరుకున్నారు. పరీక్షలు ఈ నెల 11వరకు జరుగనున్నాయి.

**కుల్కచర్లలో..**

కుల్కచర్ల: పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులందరికీ కుల్కచర్ల మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం తెలుగు పరీక్ష కొనసాగగా కుల్కచర్ల జెడ్పీ బాలికల పాఠశాలలో 55మందికి 5మంది గైర్హాజరయ్యారు. బాలుర పాఠశాలలో 33 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారు.

# ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న రాజిరెడ్డి, తదితరులు

దోమ : లక్ష్మీనర్సింహ స్వామి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌జీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న దేవాలయంలో స్వామివారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా అభిషేకం, హోమం, నవగ్రహా, గణపతి పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి కల్యాణం జరిపించారు. ఈ ఉత్సవాలకు సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ అనిత, జిల్లా గ్రంథాల సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.